# బట్టబుర్ర భాగ్యం

మొట్టమొదటిసారిగా ఆయనగారి ముఖారవిందాన్ని ఫొటోలో చూసి నా గుండె లయ తప్పింది. అల్చిప్పల్లాంటి పెద్ద కళ్ళు, ఒత్తయిన జుట్టు, మీసకట్టుతో నా గుండెల్లో తిష్టవేసేసారాయన. ఒక్కసారిగా కలల అలల మీద తేలిపోయాను. ఆయన పెళ్ళిచూపుల కోసం వచ్చినప్పుడు స్వయంగా ఆయన కేశసౌందర్యాన్ని చూసి తరించే భాగ్యం కలిగింది. నా పొట్టి జుట్టును తలచుకుని కించిత్తు బాధ కూడా కలిగింది.

ఆయన ఒడ్డూ, పొడుగు, అందచందాలు నాకు నచ్చాయి. జీతం, గీతం వగైరాలు అమ్మానాన్నలకు నచ్చడంతో తక్షణం 'ఓకే' అనేసుకున్నాం. కానీ ఆయనగారు, ఆయన తరపువారూ చదివిన కోర్కెల లిస్టుకు మా నాన్న తలఊపిన తరువాతే మా పెళ్ళికి వారు పచ్చజెండా ఊపారు. ఉన్నంతలో నాన్న నాకు ఏ లోటూ



వై.కె. మూర్తి

చేయలేదు. ఝూమ్మని నా పెళ్ళయిపోయింది.

సిగ్గుతెరలతో కనులు దించుకుని, తలకాయ వంచుకుని పాలగ్లాసుతో శోభనం గదిలోకి అడుగుపెట్టిన నాడే నా ఆశల అద్దం బద్దలైపోయింది. 'ఉక్కపోస్తోంది స్నానం చేసివస్తానని ఆయన బాత్రూంలో దూరారు. కొద్దిసేపయ్యాక బాత్రూం నుంచి రామిరెడ్డి టైపు మనిషొకడు బయటికి రావడం చూసి కెవ్వుమన్నాను. ఒక్కసారిగా శోభనం గది నా చుట్టూ గిర్రున తిరిగింది. రామిరెడ్డిలా ఆఫ్ గుండుతో ఉన్న ఆయన మా ఆయనే. నెత్తిన ఉండాల్సిన అందమైన జుట్టు ఆయన చేతిలో ఉందంతే... నాకు మూర్ఛ వచ్చినంత పనయ్యింది.

నాకు మాట పడిపోయింది. నిలువు గుడ్లేసుకుని ఆయన్ని చూస్తూండిపోయాను. ఆయన నాకేసి చూసి ఓ చిరునవ్వు నవ్వారు. తళుక్కున మెరిసిన ఆ పలువరస చూసి, కొంపతీసి అవి కట్టుడుపళ్ళుకావుకదా అనిపించింది. క్షణంలో వాస్తవంలోకి వచ్చి మొర్రో అంటూ పెద్దగా ఏడవడం మొదలుపెట్టాను. ఆయన నన్ను ఊరడించారు. పెళ్ళయిన కొత్తలో పుట్టింటి మీద బెంగ ఉండటం సహజమే... వాళ్ళని తలచుకుని ఏడవడమూ సహజమే. నీ మనసు తేలిక పడేదాకా ఏడు' అన్నారు. ఏడ్చి... ఏడ్చి... ఇక ఏడవలేక ఊరుకున్నా.

'ఈ వేడి భరించలేకుండా ఉన్నాను. కాస్త ఈ బాదం నూనె మాడు మీద రాయి' అంటూ ఆయన డ్రెస్సింగ్ టేబుల్ మీదున్న ఓ సీసా పట్టుకుని నా దగ్గరకి వచ్చారు. తొలిరాత్రి ఆయన కోరిన తొలి కోరికను కాదనలేక ఆయన మాడు మీద నూనెపోసాను. అది కాస్తా జర్రున జారి ఆయన ముఖం మీదికి వచ్చింది. కళ్ళు గట్టిగా మూసుకుని మాలిష్ చేయడం మొదలుపెట్టాను. ఇత్తడి గుండిగ మీద చింతపండు వేసి తోముతున్నట్టు అనిపించింది.

'తినగతినగ వేము తియ్యగనుండు' మాదిరిగా ఆయన గుండు నాకు కొంచెం కొంచెంగా నచ్చడం మొదలయ్యింది. నెమ్మదిగా ఆయన నాకు బట్టతలోపాఖ్యానం వినిపించడం మొదలుపెట్టారు. గొప్ప గొప్ప మేధావులందరికీ నెత్తి మీద జుట్టేలేదని, ఆకాశంలోంచి ఐడియాలు బుర్రలో చొరబడేందుకు జుట్టు అడ్డమవుతుందని చెప్పారు. అంతేకాదు... బట్టతల వాడు భర్తయితే భాగ్యం కూడా... ఇంకో స్త్రీ నీ భర్త వైపు కన్నెత్తి చూడదు. అప్పుడు నీ భర్త నీకు మాత్రమే స్వంతం అని చెప్పారు.

అసలాయనకు పుట్టుకతోనే బట్టతల ఉందిట. ఎన్ని రకాలుగా వైద్యం చేయించినా అంగారకగ్రహంలాంటి గుండు మీద వెంట్రుకలు మొలకెత్తలేదన్నారు. స్కూల్లో, కాలేజీలో తన కంటూ ఓ ప్రత్యేక ఇమేజి ఉండేదని చెప్పారు. మహామహా వాళ్ళు కూడా ఎంత కష్టపడినా గుంపులో గోవిందంలా ఉండిపోయారని, ఏ గుంపులోనైనా తన ప్రత్యేకత నిలిచి ఉండేదని అన్నారు.

'నా బట్టతలపై రీసెర్చ్ ప్రారంభించాను. చాలా విషయాలు తెలుసుకున్నాను. 'అందితే జుట్టు, అందకపోతే కాళ్ళు' అన్న సామెత ప్రకారం ఎవరైనా సరే నా కాళ్ళు పట్టుకోవాల్సిందే. ఎందుకంటే నాకు జుట్టు లేదు కాబట్టి. నూనె, హెయిర్ కటింగ్, షాంపూల ఖర్చు మిగిలిపోయింది. దువ్వెనకొనాల్సిన పనిలేదు. చుండ్రు, పేల వంటి బాధలుగానీ, తలనీలాలు ఇవ్వాల్సిన అవసరంగానీ ఉండదు. ఇలా ఆలోచిస్తూపోతూంటే ఎన్నో లాభాలు కనిపిస్తాయి. కావాలంటే నువ్వూ ఆలోచించి చూడు... అన్నారు.

ఆయన ఉదయాన్నే స్నానం చేసిన తర్వాత డిటెక్టివ్‌లా విగ్గు తగిలించుకుని రోజూ ఆఫీ

సుకు వెళ్ళడం, సాయంత్రం తిరిగొచ్చాక తీసే యడం నాకస్సలు నచ్చలేదు.

ఓసారి ఆయన, నేనూ కలిసి షాపింగ్‌కి వెళ్ళాం. ప్రక్క నుంచి వేగంగా వెళ్ళిన ఓ లారీ వదిలిన నల్లనిపొగ మమ్మల్ని కాసేపు కప్పే సింది. దిక్కుమాలిన పొగమూలంగా నా మేకప్ పాడయిందేమో సరిచేసుకుందామని నా బ్యాగ్ లో అద్దం కోసం తడుముకున్నాను. అద్దం లేదు. ఏం చేయాలో తెలియక దిక్కులు చూస్తూంటే ఆయన చటుక్కున మెజీషియన్‌లా తన నెత్తి మీదున్న విగ్గు లాగిపారేసి నా ముందు తలవం చారు. తళతళలాడుతున్న ఆయన బట్టతలలో నా ప్రతిరూపం చూసి మేకప్ సరిచేసుకున్నాను. 'చూశావా నా బట్టతల వల్ల ఎన్ని ఉపయోగా లో' అంటూ చిద్విలాసంగా నవ్వారు.

ఓ రోజున అగ్గిపెట్టి తడిసిపోవడంతో తడ వని పుల్లని బయటికి తీసి తన బుర్ర మీదగీసి వెలిగించి స్టవ్ అంటించారాయన. ఎన్నో ఏళ్ళ పాటు ఎండకుఎండి, వానకు తడిసిన ఆయన గుండు గుండ్రాయిలా మారింది. ఓసారి ఫంక్ష న్‌కి వెళ్ళి వచ్చి అలసిసొలసి నిద్రపోయారు. విగ్గుతీయకుండానే మంచం మీద వాలిపోయా రు. నిద్రలో విగ్గు కాస్తా కిందికి జారి ముఖాన్ని కప్పేసింది.

బాగా నిద్రలో ఉండగా ఎవరిదో పెద్దగా అరుపు, ఆ వెనకే దబ్బున పడిన శబ్దం వినిపిం చి చటుక్కున లేచి కూర్చున్నా. బెడ్రూంలో లైటు వెలుగుతోంది. మా మంచం పక్కనే ఎవడో దొంగ కింద పడిపోయి ఉండటం కనిపించిం ది. ఒక్క క్షణం నాకేమీ అర్థంకాలేదు. పక్కకు తిరిగి చూసి కెవ్వున కేకపెట్టాను. ముఖం మీదికి జారిన విగ్గుతో పైన బట్టతల మెరుస్తూ భయంకరంగా కనిపిస్తున్న ఆయనను చూసి దొంగోడు జడుసుకుని మూర్ఛపోయి ఉంటాడ ని అర్థమయింది. నేను కుదపగా, కుదపగా లేచి ఆయన పోలీసులకు ఫోన్ చేసారు. వాడు చాలా ఏళ్ళుగా పోలీసులకు దొరకకుండా తప్పించుకు తిరుగుతున్న పెద్ద దొంగట. వాడిని పట్టిచ్చినందుకు మా ఆయనకు థ్యాంక్స్ చెప్పా రు పోలీసు అధికారి. ఇది మా ఆయన బట్టతల సాధించిన ఘనవిజయం.

నడినెత్తిన నొప్పి వస్తే జండూబామో, అమృ తాంజనమో పెట్టుకోవడం జుట్టున్న వాళ్ళకి ఎంతో కష్టం. కానీ ఆయనకి అలాంటి సమస్య లేదు. ఎక్కడ నొప్పి ఉంటే అక్కడ బామ్ రుద్దుకో గలరు. ఓసారి మా సోలార్ కుక్కర్ అద్దం పాడైతే గంటసేపు పక్కన నిలబడి బట్టతల పరావర్తనంతో అన్నం, కూరల్ని ఉడికించి పారేశారు. రాత్రిళ్ళు కరెంటుపోయినప్పుడు ఓ కొవ్వొత్తి వెలిగించి ఆయన నెత్తిమీద ఉంచితే చాలు... గదంతా వెలుగుతో నిండిపోయేది.

ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో... ఎన్నెన్నో లాభాలు... ఇవి అర్థం చేసుకోలేక బట్టతల ఉందని మొగుడ్ని వదులుకునే సోదరీమణులకు నా విన్నపం ఏమిటంటే... ఏరికోరి బట్టతల వాడిని వరించమని. 'బట్టతలని కోరు, శాంతి సౌఖ్యాలు నీ ఇంట చేరు...' అన్నదే ఇప్పుడు నా నినాదం.

## ఆకారం

పరీక్ష వ్రాసి వస్తున్న కొడుకుని తండ్రి ప్రశ్నించాడు...

"ఎలా ఉందిరా పేపరు? మార్కులెలా వస్తాయి?"

దానికి కొడుకు సమాధానం...

"పేపరు దీర్ఘచతురస్రాకారంగా ఉంది. మార్కులు వృత్తాకారంలో వస్తాయి".